

## సోమశిలలో 29.62 టీఎంసీలు

సోమశిల: సోమశిల జలాశయంలో బుధవారం సాయంత్రానికి 29.62 టీఎంసీల నీరు నిల్వ ఉంది. జలాశయంలో ప్రస్తుతం 91.498 మీటర్ల నీటిమట్టం నమోదైంది.



## బంగారం ధరలు

| | |
|---|---|
| 24 క్యారెట్లు (10 గ్రాములు) | రూ.64,020 |
| 22 క్యారెట్ల ఆర్నమెంట్ (గ్రాము) | రూ.5,749 |
| మూడు శాతం జీఎస్టీతో | రూ.5,921 |
| సవర (8 గ్రాములు) | రూ.47,368 |

గరిష్టం/కనిష్టం
31.3 /22.0

## వాతావరణం

బుధవారం గాలిలో తేమ 63 శాతం ఉంది. ఉష్ణోగ్రత సాధారణంగా ఉంది. గురువారం మార్పులేమీ ఉండబోవని వాతావరణ శాఖ తెలిపింది.

## న్యూస్‌రీల్

### 21 వరకు సెలవులు పొడిగింపు

నెల్లూరు (టౌన్): పాఠశాలలకు సెలవులను ఈ నెల 21 వరకు పొడిగించారని డీఈఓ గంగా భవాని బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. వాస్తవానికి సంక్రాంతి సెలవులను ఈ నెల తొమ్మిది నుంచి 18 వరకు రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించిందని, అయితే విద్యార్థుల తల్లిదండ్రులు, ఉపాధ్యాయుల అభ్యర్థన మేరకు వీటిని పొడిగించారని చెప్పారు. పాఠశాలలు ఈ నెల 22న పునఃప్రారంభంకానున్నాయన్నారు.

### తహసీల్దార్‌పై సోమిరెడ్డి వీరంగం



పొదలకూరు: స్థానిక తహసీల్దార్ వీరవసంతరావుపై టీడీపీ నేత సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి బుధవారం వీరంగం చేశారు. మండలంలో భూముల పంపిణీ, మైనింగ్‌లో అక్రమాలు జరుగుతున్నాయంటూ కార్యకర్తలను వెంటబెట్టుకెళ్లి నానా హంగామా సృష్టించారు. తహసీల్దార్‌పై పెద్దగా కేకలేస్తూ.. మంత్రి కాకాణికి అనుకూలంగా వ్యవహరిస్తున్నారంటూ వ్యాఖ్యానించారు. మండలంలో భూముల పంపిణీపై సమాచార హక్కు చట్టం కింద తనకు వివరాలివ్వాలని తహసీల్దార్‌తో వాగ్వాదానికి దిగారు. మండలంలో అక్రమంగా మైనింగ్ జరుగుతుంటే ఏమి చేశారు.. లంచాలు తీసుకొని ఆ ఛాయలకు వెళ్లలేకపోయారని బెదిరించారు. మీడియా సమక్షంలో భూముల పంపిణీ వివరాలను అందజేయాలని గద్దించారు. దీంతో తహసీల్దార్ వెంటనే స్థానిక పోలీసులకు సమాచారం అందించారు. పోలీసులు వచ్చి వారిని కార్యాలయం బయటకు పంపారు.

### త్వరితగతిన వ్యవసాయ ట్రాన్స్‌ఫార్మర్ల ఏర్పాటు

నెల్లూరు(వీఆర్సీసెంటర్): దరఖాస్తు చేసుకున్న రైతులకు వ్యవసాయ విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్లు వచ్చాయని, మంజూరైన వారికి వీటిని త్వరితగతిన ఏర్పాటు చేయాలని ఎస్పీడీసీఎల్ జిల్లా సర్కిల్ ఎస్ఈ విజయన్ ఆదేశించారు. నగరంలోని విద్యుత్ భవన్ నుంచి జిల్లాలోని విద్యుత్ శాఖ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్లు, డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్లతో బుధవారం నిర్వహించిన టెలి కాన్ఫరెన్స్‌లో ఆయన మాట్లాడారు. గూడూరులోని స్టోర్స్‌లో ట్రాన్స్‌ఫార్మర్లు సిద్ధంగా ఉన్నాయని, వీటిని సంబంధిత అధికారులు డ్రా చేసుకొని యుద్ధప్రాతిపదికన ఏర్పాటు చేయాలని ఆదేశించారు. కావలి, కలిగిరి, దగదర్తి, అల్లూరు సెక్షన్లు జీఐఎస్ సర్వేలో వెనుకబడి ఉన్నాయని, వీటిని పూర్తి చేయాలని సూచించారు. రానున్న వేసవిని దృష్టిలో ఉంచుకొని విద్యుత్ డిమాండ్‌కు అనుగుణంగా ముందస్తు ప్రణాళికలను సిద్ధం చేసుకోవాలన్నారు. విద్యుత్ రీడర్లు ప్రతి నెలా ఏడులోపు బిల్లులు తీసి వినియోగదారులకు అందజేయాలని ఆదేశించారు. వ్యవసాయ విద్యుత్ సర్వీసులు కలిగిన రైతుల ఆధార్, ఫోన్ నంబర్లను లింక్ చేయాలని తెలిపారు. సీనియర్ అకౌంట్స్ ఆఫీసర్ మురళి, అసిస్టెంట్ ఇంజినీర్లు కల్పన, అనిల్, నరసింహారావు పాల్గొన్నారు.

### పక్కాగా కులగణన

• కలెక్టర్ హరినారాయణన్



నెల్లూరు(దర్గామిట్ట): జిల్లాలో ఈ నెల 19 నుంచి 28 వరకు చేపట్టనున్న కులగణనను పక్కాగా నిర్వహించాలని కలెక్టర్ హరినారాయణన్ పేర్కొన్నారు. కులగణన, జన్ భాగీదారి, గణతంత్ర దిన వేడుకలు తదితరాలపై కలెక్టర్ కార్యాలయంలో సంబంధిత అధికారులతో బుధవారం నిర్వహించిన సమీక్షలో ఆయన మాట్లాడారు. కులగణన చేపట్టే సమయంలో ప్రజలతో జాగ్రత్తగా, మర్యాదగా వ్యవహరించాలని సిబ్బందికి సూచించారు. ప్రతి సచివాలయ పరిధిలో కులగణన చేసే సిబ్బంది ఇంటింటికీ వెళ్లి ఈ – కేవైసీని సేకరించాలన్నారు. మరోసారి శిక్షణను గురువారం నిర్వహించాలని సూచించారు. విజయవాడలో శుక్రవారం నిర్వహించనున్న అంబేడ్కర్ విగ్రహావిష్కరణ కార్యక్రమానికి జిల్లా నుంచి సుమారు ఐదు వేల మంది హాజరుకానున్న తరుణంలో వారికి అవసరమైన అన్ని ఏర్పాట్లు చేయాలని ఆదేశించారు. బస్సుల్లో బయల్దేరే వారికి అవసరమైన తాగునీరు, అల్పాహారం, భోజన ఏర్పాట్లతో పాటు తిరిగి గమ్యస్థానాలకు చేర్చేలా అన్ని ఏర్పాట్లు చేయాలన్నారు. అంబేడ్కర్ విగ్రహావిష్కరణ ప్రత్యక్ష ప్రసారాన్ని వీక్షించేందుకు వీలుగా తిక్కన ప్రాంగణంలో ఏర్పాట్లు చేయాలని చెప్పారు. గణతంత్ర వేడుకలను ఘనంగా నిర్వహించాలని తెలిపారు. జేసీ కూర్మనాథ్, డీఆర్వో లవన్న, జెడ్పీ సీఈఓ చిరంజీవి, డీఆర్డీఏ పీడీ సాంబశివారెడ్డి, ఐసీడీఎస్ పీడీ హేనాసుజన్ తదితరులు పాల్గొన్నారు.






గొబ్బెమ్మలను నిమజ్జనం చేస్తున్న మహిళలు



పూజా కార్యక్రమాలకు హాజరైన ఎమ్మెల్యే అనిల్

## భక్తజనసంద్రం.. పినాకినీ తీరం

సంక్రాంతి సంబరాల్లో భాగంగా సంప్రదాయ ఏటి పండగతో సింహపురి బుధవారం పరవశించింది. నగరంలోని వివిధ ప్రాంతాల నుంచి తరలివచ్చిన వారితో రంగనాయకులపేటలోని పవిత్ర పినాకినీ తీరం సందడిగా మారింది. సంప్రదాయ ఆటపాటలు.. పతంగులను ఎగురవేస్తూ.. సాంస్కృతిక కార్యక్రమాలతో చిన్నారులు, పెద్దలు ఉత్సాహంగా గడిపారు. అనంతరం పినాకినీ తీరంలో గొబ్బెమ్మలను నిమజ్జనం చేశారు. జిల్లాలోని వివిధ ప్రాంతాల నుంచి దేవతామూర్తులు పినాకినీ తీరానికి తరలివచ్చి భక్తులను కటాక్షించారు.

– సాక్షి ఫొటోగ్రాఫర్, నెల్లూరు

# పరిపూర్ణంగా.. పారదర్శకంగా



కొద్ది రోజుల్లో సార్వత్రిక ఎన్నికలు జరగనున్న తరుణంలో ఓటరు జాబితాను పరిపూర్ణంగా.. పారదర్శకంగా తయారు చేసేందుకు జిల్లా అధికార యంత్రాంగం కసరత్తు చేస్తోంది. కేంద్ర ఎన్నికల సంఘం ఆదేశాల మేరకు తుది జాబితాను ఈ నెల 22న ప్రచురించనున్న నేపథ్యంలో జిల్లా అధికారులు ఈ వ్యవహారంలో తలమునకలై ఉన్నారు. జనవరి ఒకటి నాటికి 18 ఏళ్లు నిండిన వారందరికీ ఓటు హక్కు కల్పించాలనే లక్ష్యంతో అందిన దరఖాస్తులను క్షుణ్ణంగా పరిశీలిస్తున్నారు.

• ఓటరు జాబితాపై కసరత్తు
• తొమ్మిది నెలల పాటు సాగిన ప్రక్రియ
• జిల్లాలో 71 వేల కొత్త ఓటర్ల నమోదు
• 22న తుది జాబితా ప్రచురణ



అధికారులతో సమీక్షిస్తున్న కలెక్టర్ (ఫైల్)

ఉదయగిరి: గందరగోళానికి తావు లేకుండా.. పారదర్శకంగా ఓటర్ల జాబితాను తయారు చేసే పనిలో జిల్లా అధికారులు బిజీబిజీగా ఉన్నారు. కేంద్ర ఎన్నికల సంఘం ఆదేశాల మేరకు ఓటర్ల తుది జాబితాను సోమవారం విడుదల చేయనున్నారు. కొత్త ఓట్ల నమోదు.. మార్పులు, చేర్పులకు సంబంధించిన స్పెషల్ సమ్మరీ రివిజన్ గడువు ఈ నెల తొమ్మిదితో ముగిసింది. ముసాయిదా జాబితా మేరకు జిల్లాలో కొత్తగా 71 వేల ఓట్లు నమోదయ్యాయని తెలుస్తోంది.

**ప్రణాళికాబద్ధంగా ప్రక్రియ**

• పద్దెనిమిదేళ్లు నిండిన ప్రతి ఒక్కరికీ ఓటు కల్పించేలా ప్రత్యేక క్యాంపులను నిర్వహించారు. గతేడాది ఏప్రిల్ 15 నుంచి ప్రక్రియను చేపట్టారు. జూలై 21 నుంచి ఆగస్ట్ 21 వరకు ఇంటింటి సర్వేను నిర్వహించారు. నూతన ఓట్ల నమోదు.. మార్పులు, చేర్పులు.. మృతి చెందిన వారి ఓట్ల తొలగింపు, అభ్యంతరాల స్వీకరణ ప్రక్రియ అనంతరం ముసాయిదా జాబితాను అక్టోబర్ 28న విడుదల చేశారు.
• ఎన్నికలకు గడువు ఉండటంతో ఓటర్ల నమోదు తదితరాలకు గానూ డిసెంబర్ తొమ్మిది వరకు కేంద్ర ఎన్నికల సంఘం గడువు పొడిగించింది.
• ఈ ఏడాది జనవరి ఒకటి నాటికి 18 ఏళ్లు నిండిన వారికి ఓటు హక్కు కల్పించాలనే లక్ష్యంతో కళాశాలల్లో ప్రత్యేక అవగాహన కార్యక్రమాలను అధికారులు నిర్వహించారు.

### అందిన దరఖాస్తులు

• జిల్లాలో 19,11,638 ఓటర్లు ఉండగా, కొత్తగా ఓటు నమోదుకు 97,329 దరఖాస్తులు వచ్చాయి. వీటిలో 71,974 ఓట్లకు ఆమోదం తెలిపారు.
• ఓట్ల తొలగింపు, డూప్లికేషన్, మరణాలు తదితరాలకు సంబంధించి 1,61,014 దరఖాస్తులు రాగా, వీటిలో 1,22,045కు ఆమోదం తెలిపారు. మరికొన్ని దరఖాస్తులను పరిశీలిస్తున్నారు.



బూత్ స్థాయిలో దరఖాస్తులను స్వీకరిస్తున్న సిబ్బంది (ఫైల్)

**జిల్లాలో ఇదీ ఓటర్ల లెక్క**

| నియోజకవర్గం | పోలింగ్ కేంద్రాలు | పురుషులు | స్త్రీలు | ఇతరులు |
|---|---|---|---|---|
| కందుకూరు | 271 | 1,09,050 | 1,10,770 | 25 |
| కావలి | 314 | 1,19,917 | 1,25,754 | 34 |
| ఆత్మకూరు | 278 | 1,07,395 | 1,09,034 | 11 |
| కోవూరు | 324 | 1,26,569 | 1,36,852 | 19 |
| నెల్లూరు సిటీ | 248 | 1,14,966 | 1,20,441 | 77 |
| నెల్లూరు రూరల్ | 275 | 1,28,286 | 1,35,390 | 33 |
| సర్వేపల్లి | 284 | 1,10,898 | 1,17,259 | 30 |
| ఉదయగిరి | 323 | 1,19,171 | 1,19,641 | 16 |
| మొత్తం | 2317 | 9,36,252 | 9,75,141 | 245 |

• జిల్లాలోని ఎనిమిది అసెంబ్లీ సెగ్మెంట్ల పరిధిలో గల 37 మండలాల్లో 2317 పోలింగ్ కేంద్రాలున్నాయి. వీటి పరిధిలో అభ్యంతరాలను బీఎల్వోలు నిశితంగా పరిశీలించి మార్పులు, చేర్పులు.. తొలగింపులపై కసరత్తు చేశారు.

**అర్హులకు ఓటు హక్కు కల్పించేలా చర్యలు**

అర్హులైన ప్రతి ఒక్కరికీ ఓటు హక్కు కల్పించేలా ప్రత్యేక చర్యలు చేపట్టాం. దీనికి సంబంధించి బూత్ లెవల్‌లో అవగాహన కార్యక్రమాలను నిర్వహించాం. అందిన ప్రతి దరఖాస్తునూ పరిశీలించి నిబంధనల మేరకు చర్యలు చేపడతాం. తుది జాబితాను ఈ నెల 22న విడుదల చేయనున్నాం – హరినారాయణన్, కలెక్టర్

### తుది జాబితా ప్రచురణకు చర్యలు

నెల్లూరు(దర్గామిట్ట): ఓటర్ల తుది జాబితాను ఈ నెల 22న ప్రచురించేందుకు వీలుగా అన్ని చర్యలు చేపట్టాలని జిల్లా రోల్ అబ్జర్వర్ పోలా భాస్కర్ పేర్కొన్నారు. జిల్లాలో తుది ఓటర్ల జాబితా ప్రచురణకు సంసిద్ధత.. జనాభా.. ఓటర్ల నిష్పత్తి తదితర అంశాలపై ఈఆర్వోలతో సమీక్ష సమావేశాన్ని కలెక్టర్ హరినారాయణన్ ఆధ్వర్యంలో బుధవారం నిర్వహించారు. కలెక్టరేట్లోని శంకరన్ హాల్లో నిర్వహించిన కార్యక్రమంలో భాస్కర్ మాట్లాడారు. ఓటర్ల జాబితాలో మార్పులు, చేర్పులు.. జాబితా సవరణ అంశాలకు సంబంధించిన రికార్డులను పక్కాగా నిర్వహించాలన్నారు. వారానికోసారి రాజకీయ పార్టీలతో సమావేశాలను నిర్వహించాలని సూచించారు. రాజకీయ పార్టీలు, వ్యక్తులు, మీడియాలో గానీ ఫిర్యాదులొస్తే వాటిపై చర్యలు చేపట్టి ఫిర్యాదుదారులకు సమాచారాన్ని అందించాలని పేర్కొన్నారు. అనంతరం కలెక్టర్ మాట్లాడారు. పోలింగ్ కేంద్రాల్లో మౌలిక వసతుల కల్పనను ఈ నెల 25లోపు పూర్తి చేయాలని ఆదేశించారు. జేసీ కూర్మనాథ్, డీఆర్వో లవన్న, ఈఆర్వోలు విద్యాధరి, మలోల, శీనానాయక్, మధులత, బాపిరెడ్డి, ఓబులేసు, ప్రేమ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.



సమీక్ష సమావేశంలో మాట్లాడుతున్న భాస్కర్

# ప్రజా సంక్షేమమే లక్ష్యంగా పరిపాలన



ఇళ్ల పట్టాను అందజేస్తున్న కాకాణి గోవర్ధన్‌రెడ్డి

• మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి

వెంకటాచలం: రాష్ట్రంలోని అన్ని వర్గాల సంక్షేమం, అభివృద్ధే లక్ష్యంగా సీఎం జగన్‌మోహన్‌రెడ్డి పరిపాలన సాగిస్తున్నారని రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి పేర్కొన్నారు. మండలంలోని నిడిగుంటపాళెంలో గ్రామ సచివాలయ భవనం, సైడ్ కాలువలు, సీసీ రోడ్లను బుధవారం ప్రారంభించిన అనంతరం ఆయన మాట్లాడారు. టీడీపీ హయాంలో శిలాఫలకాలతో ప్రజలను మభ్యపెట్టారని, అయితే ప్రస్తుతం అన్ని పనులను పూర్తి చేసి ప్రారంభోత్సవాలను చేపడుతున్నామని చెప్పారు. తమ ప్రభుత్వ హయాంలో నిడిగుంటపాళెంలో రూ.10.10 కోట్లతో అభివృద్ధి పనులను చేపట్టామని వెల్లడించారు. గ్రామంలో ప్రభుత్వ స్థలం లేకపోవడంతో ఐదెకరాలను రూ.1.35 కోట్లతో కొనుగోలు చేసి పేదలకు ఇళ్ల స్థలాలను పంపిణీ చేశామన్నారు.

**నమ్మక ద్రోహి చంద్రబాబు**

గత ఎన్నికల్లో ప్రజలకు ఇచ్చిన వాగ్దానాలను అమలు చేయని నమ్మక ద్రోహి చంద్రబాబు అని మంత్రి విమర్శించారు. రైతులు, మహిళలకు రుణమాఫీ చేస్తామని ప్రకటించి అమలు చేయకపోవడంతో 2019 ఎన్నికల్లో ప్రజలు ఓటుతో బుద్ధి చెప్పారని పేర్కొన్నారు. ఎన్నికలు సమీపిస్తుండటంతో మరోసారి ప్రజలను మోసం చేయాలని చంద్రబాబు చూస్తున్నారని ఆరోపించారు. బాబు ష్యూరిటీ – ప్రజలకు గ్యారంటీ పేరుతో తిరగడం సిగ్గుచేటని విమర్శించారు. అసలు లెక్కలే సక్రమంగా తెలియకుండా బహిరంగ సభల్లో లోకేశ్ మాట్లాడుతూ నవ్వులపాలవుతున్నారని ఎద్దేవా చేశారు. చంద్రబాబు, లోకేశ్ ఎన్ని అబద్ధాలు చెప్పినా నమ్మే పరిస్థితుల్లో ప్రజలు లేరని స్పష్టం చేశారు. సర్వేపల్లి నియోజకవర్గంలో పేదలకు అసైన్‌మెంట్ పట్టాలను పంపిణీ చేస్తుంటే, సోమిరెడ్డి తప్పుడు ప్రచారాలు చేస్తున్నారని మండిపడ్డారు. నియోజకవర్గంలో జరిగిన అభివృద్ధిని చూసి ఓర్వలేక మతిభ్రమించి మాట్లాడుతున్నారని విమర్శించారు. అనంతరం పలువురు లబ్ధిదారులకు ఇళ్ల పట్టాలను పంపిణీ చేశారు. వైస్ ఎంపీపీ కసుపూరు కోదండరామిరెడ్డి, వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ జిల్లా ఉపాధ్యక్షుడు మందల వెంకటశేషయ్య, పార్టీ మండలాధ్యక్షుడు కొణిదెన మోహన్‌నాయుడు, ఎంపీటీసీలు వేమారెడ్డి రఘునందన్‌రెడ్డి, శివకుమార్‌రెడ్డి, నేతలు కట్టంరెడ్డి శ్రీధర్‌రెడ్డి, రోహిత్‌రెడ్డి, విజయకుమార్‌రెడ్డి, కొణిదెన విజయభాస్కర్‌నాయుడు, పైనం నరసయ్య, కిషోర్‌రెడ్డి, అడపాల ఏడుకొండలు తదితరులు పాల్గొన్నారు.

### 3లోపు ఈ - క్రాప్, కేవైసీ నమోదు పూర్తి చేయాలి

కోవూరు: ఈ – క్రాప్, ఈ – కేవైసీ నమోదును ఫిబ్రవరి మూడులోపు పూర్తి చేయాలని జిల్లా వ్యవసాయాధికారి సత్యవాణి పేర్కొన్నారు. కోవూరు వ్యవసాయ శాఖ సబ్ డివిజన్ పరిధిలోని ఐదు మండలాల వ్యవసాయాధికారులు, గ్రామ వ్యవసాయ సహాయకులతో సమీక్ష సమావేశాన్ని స్థానిక సంఘమిత్ర కార్యాలయ సమావేశ మందిరంలో బుధవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడారు. ఏఓ, వీఏఓలకు నిర్దేశించిన లక్ష్యాలను సకాలంలో పూర్తి చేయాలని ఆదేశించారు. ఆర్బీకేల్లో ఎరువులను సీసీఆర్ కార్డుల మేరకు రైతులకు అందించాలని సూచించారు. ఎరువుల విక్రయాలను ఆన్‌లైన్లో నమోదు చేయడంతో పాటు బకాయిల్లేకుండా చూడాలని చెప్పారు. ఎరువుల యాజమాన్య పద్ధతులను పాటించడమే కాకుండా విచక్షణరహితంగా పురుగు మందులు చల్లకుండా వ్యవసాయ శాఖ సూచనలను పాటించాలని రైతులను కోరారు. నానో యూరియా వినియోగంపై గ్రామ వ్యవసాయ సహాయకులు అవగాహన కల్పించాలన్నారు. సహాయ వ్యవసాయ సంచాలకులు సుజాత, నర్సోజీ, శేషగిరిరావు, మండల వ్యవసాయాధికారులు ఇందిరావతి, సురేంద్రరెడ్డి, శ్రీలక్ష్మి, వెంకటకృష్ణయ్య, టెక్నికల్ ఏఓ మేరీ కమల, శ్రీహరి, తదితరులు పాల్గొన్నారు.

# అర్హులందరికీ పట్టాల పంపిణీ

- రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి


మాట్లాడుతున్న కాకాణి

నెల్లూరు(దర్గామిట్ట): అన్నమయ్య జిల్లాలో అర్హులందరికీ అసైన్‌మెంట్ భూములకు పట్టాలు పంపిణీ చేస్తామని రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి, ఆ జిల్లా ఇన్‌చార్జి మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి తెలిపారు. నెల్లూరులోని క్యాంప్ కార్యాలయం నుంచి బుధవారం ఆయన వీడియో కాన్ఫరెన్స్ ద్వారా ఆ జిల్లా అసైన్‌మెంట్ రివ్యూ కమిటీ సమావేశం నిర్వహించారు. దీనికి అక్కడి కలెక్టరేట్ నుంచి రాయచోటి ఎమ్మెల్యే శ్రీకాంత్, కలెక్టర్ గిరీష, జాయింట్ కలెక్టర్ ఫర్హాన్ అహ్మద్‌ఖాన్, అధికారులు హాజరయ్యారు. మంత్రి మాట్లాడుతూ అసైన్‌మెంట్ భూములకు సంబంధించి 1,269 ఎకరాలను 796 మంది లబ్ధిదారులకు పట్టాలు పంపిణీ చేసేందుకు కమిటీలో నిర్ణయించినట్లు చెప్పారు. పెండింగ్‌లో ఉన్న దరఖాస్తులను త్వరగా పరిష్కరించేందుకు చర్యలు చేపట్టి కమిటీ ఆమోదం కోసం తీసుకురావాలని ఆదేశించారు.



# గణతంత్ర దినోత్సవానికి పక్కా ఏర్పాట్లు

- జేసీ రోణంకి కూర్మనాథ్


అధికారులకు సూచనలిస్తున్న జేసీ కూర్మనాథ్

నెల్లూరు(దర్గామిట్ట): ఈనెల 26వ తేదీన నెల్లూరులో గణతంత్ర దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించేందుకు పక్కాగా ఏర్పాట్లు చేయాలని జేసీ రోణంకి కూర్మనాథ్ ఆదేశించారు. నెల్లూరులోని తిక్కన ప్రాంగణంలో బుధవారం ఆయన ఏర్పాట్లపై జిల్లా అధికారులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ సంవత్సర కాలంలో చేపట్టిన అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలపై కలెక్టర్ ప్రసంగిస్తారన్నారు. ప్రసంగం తయారు చేసేందకు ప్రగతి నివేదికలను ఈనెల 19వ తేదీలోగా ముఖ్య ప్రణాళిక అధికారికి అందజేయాలన్నారు. అన్ని ప్రభుత్వ శాఖల్లో ప్రతిభ చూపిన ఉద్యోగులకు ప్రశంసాపత్రాలు అందజేసేందుకు పేర్లు, వారు చేసిన సేవలను వివరిస్తూ నిర్ణీత సమయంలోగా పంపాలన్నారు. ప్రతి ప్రభుత్వ అధికారి వారి కార్యాలయంలో జాతీయ పతాకాన్ని ఆవిష్కరించి పోలీస్ పరేడ్ మైదానంలో జరిగే వేడుకలకు హాజరుకావాలన్నారు. ఈసారి కూడా కోవిడ్ నిబంధనలను విధిగా పాటిస్తూ వేదిక ఏర్పాట్లు చేయాలన్నారు. దేశభక్తిని ప్రతిబింబించేలా విక్రమ సింహపురి విశ్వవిద్యాలయంతో సహా వివిధ విద్యాసంస్థల విద్యార్థులతో సాంస్కృతిక కార్యక్రమాలు ఏర్పాటు చేయాలన్నారు. అలాగే సాయంత్రం శ్రీవెంకటేశ్వర కస్తూర్బా కళాక్షేత్రంలో సమాచార, పౌర సంబంధాల శాఖ ఆధ్వర్యంలో సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించాలన్నారు. పరేడ్ మైదానం, కళాక్షేత్రం పరిసర ప్రాంతాల్లో పారిశుద్ధ్యంపై ప్రత్యేక దృష్టి సారించాలని మున్సిపల్ అధికారులను ఆదేశించారు. తాగునీటి వసతి కల్పించాలన్నారు. ప్రజా ప్రతినిధులను సాదరంగా ఆహ్వానించడంతోపాటు వారికి ప్రొటోకాల్ ప్రకారం సీటింగ్ ఏర్పాట్లు తప్పనిసరిగా చేయాలన్నారు. ఈ వేడుకల్లో ఎలాంటి అంతరాయం లేకుండా విద్యుత్ సరఫరా ఉండేలా చూడాలన్నారు. కార్యక్రమాలు జరిగే చోట వైద్య శిబిరాలు పెట్టి అంబులెన్స్‌లను సిద్ధంగా ఉంచుకోవాలన్నారు. విద్యాసంస్థల నుంచి విద్యార్థులు వేడుకలు జరిగే ప్రదేశానికి చేరుకునేలా చర్యలు తీసుకోవాలన్నారు. జిల్లాలో అమలవుతున్న వివిధ అభివృద్ధి, సంక్షేమ పథకాలు ప్రతిబింబించేలా ప్రభుత్వ శాఖల ప్రదర్శన శాలలు, శకటాలు ఏర్పాటు చేయాలన్నారు. సమావేశంలో డీఆర్వో ఎస్.లవన్న, ఆర్మ్ రిజర్వ్ ఏఎస్పీ శ్రీనివాసరావు, డీఆర్‌డీఏ, డ్వామా ఈడీలు సాంబశివారెడ్డి, వెంకట్రావు, జెడ్పీ సీఈఓ చిరంజీవి, నెల్లూరు ఆర్డీఓ మలోల, ఐటీడీఏ పీఓ మందా రాణి తదితరులు పాల్గొన్నారు.

# విద్యుత్ షాక్‌తో మహిళ మృతి

లింగసముద్రం: గడ్డి కోసేందుకు వెళ్లిన మహిళ విద్యుత్ షాక్‌కు గురై అక్కడికక్కడే మృతిచెందింది. ఈ ఘటన లింగసముద్రం మండలంలోని మొగిలిచర్ల గ్రామంలో బుధవారం జరిగింది. కందుకూరు డీఎస్పీ రామచంద్ర కథనం మేరకు.. మొగిలిచర్ల గ్రామానికి చెందిన పల్లాల మాల్యాద్రి, కొండారెడ్డి పొగాకుకు నీరు పెట్టేందుకు పొలాలకు సమీపంలోని టెలికాం టవర్‌కు ఉన్న 24 గంటల విద్యుత్ లైన్‌కు మోటార్ ఆడేందుకు తీగలను తగిలించారు. వాటిని పొలం గట్టుమీద వేశారు. గ్రామంలోని ఎస్సీ కాలనీకి చెందిన యానదాసరి కొండమ్మ (55) గడ్డి కోసేందుకు వెళ్లింది. గడ్డి కోస్తుండగా విద్యుత్ తీగలు చేతికి తగిలి షాక్‌తో మృతిచెందింది. పొలానికి నీరు పెడుతున్న వారు గమనించి అక్కడికి వెళ్లి తీగలను తొలగించారు. సమాచారం అందుకున్న డీఎస్పీ రామచంద్ర ఘటనా స్థలాన్ని పరిశీలించారు. కొండమ్మ కుమార్తె ఇచ్చిన ఫిర్యాదు మేరకు మాల్యాద్రి, కొండారెడ్డిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఆయన తెలిపారు.





# ఆదాలపై అసత్య ప్రచారం ఆపండి

- నెల్లూరు రూరల్‌లో ప్రభాకర్‌రెడ్డి గెలుపు ఖాయం
- ఎస్సీ, ఎస్టీ నేతలు వెంకయ్య, రవి


మాట్లాడుతున్న వెంకయ్య, రవి

నెల్లూరు(వేదాయపాళెం): నెల్లూరు ఎంపీ ఆదాల ప్రభాకర్‌రెడ్డి పార్టీ మారుతారంటూ దుష్ప్రచారం చేస్తున్నారని, అసత్య ప్రచారాన్ని మానుకోవాలని వైఎస్సార్‌సీపీ సీనియర్ నాయకులు స్వర్ణ వెంకయ్య, ఆ పార్టీ ఎస్టీ సెల్ జిల్లా అధ్యక్షుడు పాలకీర్తి రవి తెలిపారు. నెల్లూరు దర్గామిట్టలోని అంబేడ్కర్ భవన్‌లో బుధవారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడారు. వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని మళ్లీ సీఎంను చేసేందుకు ప్రజలు సిద్ధంగా ఉన్నారన్నారు. వైఎస్సార్‌సీపీ నెల్లూరు రూరల్ నియోజకవర్గ ఇన్‌చార్జిగా ఉన్న ఆదాలకు పార్టీ మారాల్సిన అవసరం లేదన్నారు. ఇన్‌చార్జిగా బాధ్యతలు తీసుకున్న నాటి నుంచి సుమారు రూ.150 కోట్ల మేర అభివృద్ధి కార్యక్రమాలను చేపట్టారన్నారు. అలాగే దాదాపు రూ.30 కోట్ల పైగా ఎంపీ నిధులను రూరల్ నియోజకవర్గంలో పనులకు ఖర్చు చేశారన్నారు. ఇతర ఎంపీలు దగ్గర కూడా నిధులు తీసుకొచ్చి రూరల్ నియోజకవర్గంలో అభివృద్ధి చేపట్టారన్నారు. ఆయన్ను భారీ మెజార్టీతో గెలిపించేందుకు రూరల్ ప్రజలు సిద్ధంగా ఉన్నారన్నారు. ఎమ్మెల్యే కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి తన సొంత ప్రయోజనాల కోసం మాత్రమే పనిచేశారన్నారు. ఓటమి భయంతోనే ఆదాల పార్టీ మారుతారని ప్రచారం చేస్తున్నారని ఆరోపించారు. ఆయన జగన్‌తోనే ఉంటారని చెప్పారు. సమావేశంలో దళిత, గిరిజన సంఘాలకు చెందిన అరవ కామాక్షి, వడ్లమూడి సుమంత్, గిరీష్, సాయి, రమణయ్య తదితరులు పాల్గొన్నారు.

## జిల్లా స్థాయి తైక్వాండో పోటీలు నేడు

కందుకూరు రూరల్: జిల్లా స్థాయిలో తైక్వాండో సబ్ జూనియర్ బాలబాలికల పోటీలు ఈనెల 18వ తేదీ కందుకూరులోని టీఆర్ఆర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాల క్రీడా మైదానంలో నిర్వహిస్తున్నట్లు తైక్వాండో అసోసియేషన్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు, మాస్టర్ ఎస్‌కే అబ్దుల్ సలాం, జిల్లా కార్యదర్శి పి.అఖిల్ బుధవారం తెలిపారు. ఆసక్తి గల క్రీడాకారులు 18వ తేదీ ఉదయం 9 గంటలకు హాజరుకావాలని సూచించారు. ప్రతిభ చూపిన వారు ఈ నెల 20, 21వ తేదీల్లో నంద్యాలలో జరిగే రాష్ట్ర స్థాయి పోటీల్లో పాల్గొంటారన్నారు. పూర్తి వివరాలకు 94949 46207 ఫోన్ నంబర్‌ను సంప్రదించాలని తెలియజేశారు.

## నిమ్మ ధరలు (కిలో)



| | |
|---|---|
| పెద్దవి : | రూ.34 |
| సన్నవి : | రూ.25 |
| పండ్లు : | రూ.15 |

## పౌల్ట్రీ ధరలు



| | |
|---|---|
| బ్రాయిలర్ (లైవ్) : | 120 |
| లేయర్ (లైవ్) : | 85 |
| బ్రాయిలర్ చికెన్ : | 216 |
| బ్రాయిలర్ స్కిన్‌లెస్ : | 240 |
| లేయర్ చికెన్ : | 145 |

# హుండీలు పగులగొట్టి నగదు అపహరణ


హుండీని పరిశీలిస్తున్న ఎస్సై వీరప్రతాప్

కొడవలూరు: మండలంలోని గండవరం ఉదయకోళేశ్వరస్వామి, గంగమ్మ ఆలయాల్లో హుండీలను పగులగొట్టి నగదు అపహరించారు. ఇంకా గంగమ్మ మంగళసూత్రాన్ని చోరీ చేశారు. పోలీసుల కథనం మేరకు.. మంగళవారం అర్ధరాత్రి దాటాక ఇద్దరు గుర్తుతెలియని వ్యక్తులు పక్కపక్కనే ఉన్న రెండు ఆలయాల్లోకి ప్రవేశించారు. ఉదయకోళేశ్వరస్వామి ఆలయంలోని హుండీని అర కిలోమీటర్ దూరం తీసుకెళ్లి పగులగొట్టి అందులోని నగదు అపహరించారు. గంగమ్మ ఆలయ హుండీని అలాగే చేశారు. అమ్మవారి మెడలోని 20 గ్రాముల బంగారు మంగళసూత్రాన్ని కూడా అపహరించుకుపోయారు. పూజారులు బుధవారం ఆలయాలకు వచ్చి చోరీ జరిగినట్లు గుర్తించి ఈఓ బి.శాంతయ్యకు సమాచారం అందించారు. ఆయన పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఎస్సై కె.వీరప్రతాప్ ఘటనా స్థలానికి వెళ్లి పరిశీలించారు. గతేడాది బ్రహ్మోత్సవాల అనంతరం ఆలయాల్లో హుండీ కానుకల లెక్కింపు జరగలేదు. భక్తులు తరచూ వస్తుంటారు. దీనిని బట్టి రెండు హుండీల్లో కలిపి రూ.50 వేల వరకూ నగదు ఉండొచ్చని అంచనా వేస్తున్నారు. ఆలయ ప్రాంగణంలో పోలీసు శాఖ సీసీ కెమెరాలు ఏర్పాటు చేసింది. చోరీ దర్యాప్తులో అవి కీలకంగా మారాయి. ఇద్దరు ఆగంతకులు ఆలయంలోకి వెళ్లినట్లు సీసీ కెమెరా ఫుటేజీ ఆధారంగా తెలుస్తోంది. వీరు పాత నేరస్తులని పోలీసులు గుర్తించినట్లు సమాచారం. ఎస్సై కేసు దర్యాప్తు చేస్తున్నారు.

# నడుచుకుంటూ వెళ్తుండగా..

- వాహనం ఢీకొని వ్యక్తి మృతి

నెల్లూరు(క్రైమ్): జాతీయ రహదారి వెంబడి నడుచుకుంటూ వెళ్తున్న గుర్తుతెలియని వ్యక్తిని వాహనం ఢీకొనడంతో మృతిచెందాడు. సౌత్ ట్రాఫిక్ పోలీసుల కథనం మేరకు.. ఒడిశాకు చెందిన దిలీప్ నాయక్ (40)కు వివాహమై భార్య, పిల్లలున్నారు. అతను కొన్ని సంవత్సరాల క్రితం ఉపాధి నిమిత్తం నెల్లూరు జిల్లాకు వచ్చాడు. ప్రస్తుతం తిరుపతి జిల్లా చిల్లకూరు మండలం బూదనం టోల్‌ప్లాజా సమీపంలోని ఓ దాబాలో వంట మాస్టర్‌గా పనిచేస్తూ అప్పుడప్పుడు కుటుంబసభ్యుల వద్దకు వెళ్తుంటాడు. దిలీప్ స్నేహితులు నెల్లూరు నగరంలోని గొలగమూడి క్రాస్‌రోడ్డు సమీపంలో ఉన్న దాబాల్లో పనిచేస్తూ అక్కడే ఉంటున్నారు. ఇటీవల సంక్రాంతి పండగ సందర్భంగా అతను స్నేహితుల వద్దకు వచ్చాడు. మంగళవారం అర్ధరాత్రి గొలగమూడి క్రాస్‌రోడ్డు వద్దనుంచి శ్రీహరి దాబా వద్దకు జాతీయ రహదారి వెంబడి నడుచుకుంటూ వెళ్తున్నాడు. ఈ సమయంలో చెన్నై వైపు నుంచి కావలి వైపు వెళ్తున్న గుర్తుతెలియని వాహనం ఢీకొంది. ఈ ఘటనలో దిలీప్ నాయక్ అక్కడికక్కడే మృతిచెందాడు. ఈ మేరకు సౌత్ ట్రాఫిక్ పోలీసులకు సమాచారం అందింది. వారు ఘటనా స్థలానికి చేరుకుని పరిశీలించి మృతదేహాన్ని శవపరీక్ష నిమిత్తం జీజీహెచ్ మార్చురీకి తరలించారు. మృతుడి బంధువు నాగార్జున నాయక్ ఫిర్యాదు మేరకు సౌత్ ట్రాఫిక్ పోలీసులు బుధవారం కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

# స్వగ్రామానికి వెళ్లే దారిలో..


చికిత్స పొందుతున్న సుదర్శన్


తీవ్రంగా గాయపడి చికిత్స పొందుతున్న రాజేష్

- రోడ్డు ప్రమాదంలో ఇద్దరికి తీవ్ర, ఒకరికి స్వల్ప గాయాలు

ఆత్మకూరు: సమీప బంధువుల ఇంటికి వచ్చి పండగ విందు అనంతరం స్వగ్రామానికి మోటార్‌బైక్‌పై వెళ్తుండగా జరిగిన రోడ్డు ప్రమాదంలో ముగ్గురు యువకులు గాయపడ్డారు. ఈ ఘటన బుధవారం రాత్రి ఆత్మకూరు మున్సిపల్ పరిధిలో జరిగింది. ఆత్మకూరు సీఐ జి.వేణు, ఎస్సై కె.ముత్యాలరావు కథనం మేరకు.. సంగం మండలం వెంగారెడ్డిపాళెం గ్రామానికి చెందిన సోదరులు రాజేష్, కిశోర్ తమ బంధువు సుదర్శన్‌తో కలిసి ఆత్మకూరులోని సమీప బంధువు బాలసుబ్రహ్మణ్యం ఇంటికి బుధవారం ఉదయం వచ్చారు. మధ్యాహ్నం అందరూ సంతోషంగా విందు చేసుకున్నారు. రాత్రి 7.30 గంటల సమయంలో బైక్‌పై స్వగ్రామానికి బయలుదేరారు. ఈ సమయంలో ముంబై రహదారిపై శాంతినగర్ సమీపంలో ఎదురుగా వస్తున్న మినీవ్యాన్‌ను వారి బైక్ ఢీకొని ముగ్గురూ గాయపడ్డారు. సమాచారం అందుకున్న 108 అంబులెన్స్ సిబ్బంది క్షతగాత్రులకు ఆత్మకూరు ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. రాజేష్ తలకు తీవ్ర గాయమైంది. సుదర్శన్ కాలు విరిగింది. కిశోర్‌కు చిన్నపాటి గాయాలయ్యాయి. ప్రథమ చికిత్స అనంతరం పరిస్థితి విషమంగా ఉండటంతో రాజేష్, సుదర్శన్‌ను నెల్లూరుకు తరలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.